సాక్షి ఒడిశా

బుధవారం ౹ 2 ౹ అక్టోబర్ ౹ 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ.3,94,073

బంగారం 28 గ్రాములు 50 మిల్లీ గ్రాములు

వెండి 843 గ్రాములు 900 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



భద్రక్‌లో డీజీపీ పర్యటన

భద్రక్‌లోని వివాదాస్పద ప్రాంతాల్లో డీజీపీ వై.బి.ఖురానియా మంగళవారం పర్యటించారు.

– 10లో



వృద్ధుల అనుభవాలు ప్రగతికి మార్గదర్శకాలు – 10లో

వయో వృద్ధుల అనుభవాలు సమాజ ప్రగతికి మార్గదర్శకాలు అని మున్సిపల్ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి అన్నారు.

న్యూస్‌రీల్

పరామర్శ



మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న రమేష్ మజ్జి తదితరులు

కొరాపుట్: బాణాసంచా ప్రమాదంలో మృతి చెందిన దీపక్ హరిజన్ కుటుంబాన్ని మాజీ ఎంపీ రమేష్ చంద్ర మజ్జి మంగళవారం పరామర్శించారు. నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ పట్టణంలోని మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆయనతో పాటు బీజేడీ నాయకులు ఉన్నారు.

ఘనంగా కాఫీ దినోత్సవం



వేదిక మీద ఈశ్వర్‌చంద్ర పాణిగ్రాహీ తదితరులు

కొరాపుట్: జిల్లా కేంద్రంలో అంతర్జాతీయ కాఫీ దినోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. కాఫీ బోర్డు ఆవరణలోని టెక్నికల్ ఇవాల్యూషన్ సెంటర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ వి.కీర్తివాసన్ కార్యక్రమం ప్రారంభించారు. కొరాపుట్ సెంట్రల్ కో–ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర్ చంద్ర పాణిగ్రాహీ మాట్లాడుతూ ఇక్కడ పండించిన కాఫీ పంట రుచి అంతర్జాతీయంగా పేరు తెచ్చుకుందని గుర్తు చేశారు. స్థానికంగా పండిన కాఫీ గింజలతో తయారు చేసిన కాఫీ ఉత్పత్తులను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఒడిశా కాఫీ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రదీప్ మహంతి, కార్యదర్శి లలిటెందు దేవ్, ప్లానింగ్ బోర్డు డిప్యూటీ డైరక్టర్ సుర్జకాంత్ బెహరా తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

పర్లాకిమిడి: స్థానిక శ్రీకృష్ణచంద్ర గజపతి అటానమస్ కళాశాలలో జాతీయ వాలంటరీ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రిన్సిపల్ డా.జితేంద్రనాథ్ పట్నాయిక్ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదాన శిబిరాల ద్వారా క్షతగాత్రులకు అత్యవసర పరిస్థితుల్లో మెడికల్‌లో రక్తం అందించడం జరుగుతుందని యూత్ రెడ్‌క్రాస్ వింగ్ అధ్యక్షుడు సుశాంత బెహరా అన్నారు. ఈ రక్తదాన శిబిరంలో రెడ్‌క్రాస్ సభ్యులు, విద్యార్థులు విరివిగా పాల్గొని 44 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ప్రభుత్వ మెడికల్ బ్లడ్ బ్యాంక్ ఫార్మసిస్టు ఖగేశ్వర బెహరా ఇతర సిబ్బంది సహకరించారు. శిబిరంలో అసిస్టెంట్ ప్రొ.మానసి సాహుకార్, అజయ్‌కుమార్ రైతా, పైతా శబర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం



సంఘటన స్థలం వద్ద సోయేబ్ మృతదేహం

రాయగడ: బైకు అదుపు తప్పి ఒక ట్రాక్టర్‌ను వెనుకనుంచి బలంగా ఢీకొట్టిన ఘటనలో బైకు చోదకుడు దుర్మరణం పాలయ్యాడు. జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి పంచాయతీలోని డొంగాశిలి వద్ద సోమవారం సాయంత్రం చోటుచేసుకున్న ఈ ఘటనలో మృతుడు సోరుబలి గ్రామానికి చెందిన సోయేబ్ మాఝి (32)గా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం టికిరి పీహెచ్‌సీకి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సనొమట్టికొన గ్రామంలోని ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న తన ఇద్దరు పిల్లలను సోయేబ్ సోమవారం బైకుపై ఇంటికి తీసుకొస్తున్న సమయంలో డొంగాశిలి బ్రిడ్జి వద్ద బైకు వెనుక కూర్చున్న తన పిల్లల బ్యాగ్ కింద పడిపోయింది. దీంతో బైకుని పక్కన నిలిపి ఇద్దరు పిల్లలను అక్కడే దింపి బ్యాగును తీసుకువచ్చేందుకు సోయేబ్ బైకును వెనుకకు తిప్పి వెళ్లాడు. అయితే ఆ సమయంలో బైకు అదుపుతప్పి అదేమార్గంలో వస్తున్న ఒక ట్రాక్టర్‌ను ఢీకొన్నాడు. దీంతో ట్రాక్టర్ కింద పడిపోయిన సోయేబ్ సంఘటన స్థలం వద్దే మృతి చెందాడు. అదే మార్గంలో వెళ్తున్న కొందరు ప్రమాదం సమాచారాన్ని పోలీసులకు తెలియజేశారు.

ఎట్టకేలకు..!



- ఆర్పణ్ బియ్యం వేలానికి నిర్ణయం
- వచ్చే నిధులు స్వామివారి ఖాతాకు జమ
- నాణ్యత పరిశీలించేందుకు ఔత్సాహికులకు అనుమతి

భువనేశ్వర్: ఎట్టకేలకు ఆర్పణ్ బియ్యం వినియోగంపై నిర్ణయం జరిగింది. పూరీ శ్రీమందిరం ప్రాకార ప్రాజెక్టు ప్రారంభోత్సవం పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా సేకరించిన అర్పణ్ బియ్యం వేలం వేసేందుకు యంత్రాంగం సిద్ధమైంది. ఇలా విక్రయించిన అర్పణ్ బియ్యం నిధులను స్వామి ఖజానాలో జమ చేయడం జరుగుతుందని పూరీ జిల్లా కలెక్టర్, శ్రీమందిరం డిప్యూటీ ప్రధాన పాలన అధికారి సిద్ధార్థ్ శంకర్ స్వంయి తెలిపారు. అర్పణ్ బియ్యం వినియోగంపై మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీమందిరం ప్రాకార ప్రాజెక్టు ఆరంభం పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు, భక్తులు స్వచ్ఛందంగా అందజేసిన బియ్యం సద్వినియోగం కాలేదు. అందువలన నిరుపయోగంగా ఉన్న ఈ బియ్యం సకాలంలో విక్రయించి అక్కరకు వచ్చే వర్గాలకు చేరవేయాలనే సంకల్పంతో వేలం వేసేందుకు ప్రతిపాదించారు.

నిరుపయోగంగా మారకముందే

అర్పణ్ బియ్యం నిరుపయోగం కాకముందే వేలం ప్రక్రియ ముగించాలని నిర్ణయించారు. ఔత్సాహిక వర్గాలు, వ్యక్తులు ముందుకొచ్చి అధిక మొత్తం చెల్లించి ఈ బియ్యం కొనుగోలు చేసుకుంటారని వివరించారు. ఇలా జమైన సమగ్ర మొత్తం స్వామి ఖజానాకు బదిలీ చేస్తారు. ఔత్సాహిక వర్గాలు అర్పణ్ బియ్యం నాణ్యత పరీక్షించేందుకు అనుమతించారు. దీనికోసం 15 రోజులు మాత్రమే గడువు కేటాయించనున్నారు. అనంతరం అర్పణ్ బియ్యం వేలం వేయడం పూర్తి చేస్తారు. రాష్ట్ర పౌర సరఫరా, వినియోగదారుల సంక్షేమ శాఖ వేలం ప్రక్రియ పర్యవేక్షిస్తుంది.

భారీగా పోగైన టెంకాయలు

అర్పణ్ రథం పరిక్రమతో శ్రీమందిరం ప్రాకార ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి రాష్ట్రం నలుమూలల్లో భక్తులు టెంకాయలు, వక్క స్వచ్ఛందంగా అందజేశారు. ఈ నేపథ్యంలో 3,949 టెంకాయలు, 426 బస్తాల వక్క లభించింది. వీటిలో 150 బస్తాల వక్క శ్రీ గుండిచా మందిరం, 276 బస్తాల వక్క అక్షయ పాత్ర ఫౌండేషన్ ప్రాంగణంలో పదిలపరిచారు.



భక్తుల నుంచి బియ్యం సేకరిస్తున్న అర్పణ్ రథాలు (ఫైల్)

స్వల్ప వినియోగం

భారీగా పోగైన అర్పణ్ బియ్యం స్వల్పంగా మాత్రమే వినియోగించారు. శ్రీగుండిచా మందిరంలో భద్రపరిచిన అర్పణ్ బియ్యంలో కొంతభాగం వినియోగించారు. 3,856.84 క్వింటాళ్ల అర్పణ్ బియ్యం సువార్ మహా సువార్ సేవకులకు తరలించారు. మరో 735.07 క్వింటాళ్ల బియ్యం ఇతర సందర్భాల్లో వినియోగించారు. ఈ లెక్కన సమగ్రంగా 10,160.39 క్వింటాళ్ల అర్పణ్ బియ్యం మిగిలి ఉన్నాయి. వాస్త వానికి భక్తిభావంతో ప్రజలు ప్రదానం చేసిన బియ్యంతో ప్రసాదం తయారు చేసి దర్శనం చేసుకున్న భక్తులు, యాత్రికులకు ఉచితంగా పంపిణీ చేయాలని గత ప్రభుత్వం సంకల్పించింది. ఈ నిర్ణయం మేరకు సువార్, మహా సువార్ వర్గం సేవాయత్‌ల ఆధ్వర్యంలో ఖెచుడి మరియు కన్నికా ప్రసాదాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు పురస్కరించుకుని నిబంధనలు అమలు కావడంతో ఉచిత ప్రసాదాల పంపిణీ నిలిపివేశారు. అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం శ్రీమందిరం నలువైపుల ద్వారాల ప్రాంగణంలో కన్నిక, ఖెచుడి ప్రసాదాల ఉచిత పంపిణీ నిలిపి వేసింది. దీంతో అర్పణ్ బియ్యం వినియోగం స్తంభించి నిరుపయోగమై మరుగునపడ్డాయి.

ప్రభుత్వ అంగీకారంతో..

ప్రస్తుతం ఈ బియ్యం వినియోగానికి అనుకూలంగా ఉన్నట్లు ధ్రువీకరించిన మేరకు వేలం వేసేందుకు నిర్ణయించినట్లు వివరించారు. మూలుగుతున్న అర్పణ్ బియ్యం వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వానికి రెండు ప్రతిపాదనలు పంపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు భక్తి భావోద్వేగంతో స్వచ్ఛందంగా ప్రదానం చేయడంతో పోగైన అర్పణ్ బియ్యం అనాథ ఆశ్రమాలకు పంపిణీ చేయడం లేదా విక్రయించి చేకూరిన ధనం శ్రీమందిరం పాలక వర్గానికి అప్పగించడం శ్రేయోదాయకమని ప్రతిపాదించారు. అయితే వేలంవేసి నిధులను స్వామి ఖజానాకు బదిలీ చేయాలనే యోచనకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించడంతో వేలం ప్రక్రియ ఊపందుకుంది.



అర్పణ్ బియ్యంతో తయారు చేసిన ప్రసాదం పంపిణీ (ఫైల్)

1,4017.23 క్వింటాళ్ల బియ్యం

శ్రీమందిరం ప్రాకార ప్రాజెక్టు ప్రారంభోత్సవం పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా అర్పణ్ రథం పరిక్రమ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలు స్వచ్ఛందగా బియ్యం, టెంకాయలు, వక్క ప్రదానం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రం నలుమూలల నుంచి సమగ్రంగా 1,4017.23 క్వింటాళ్ల అర్పణ్ బియ్యం పోగై పూరీ శ్రీమందిరానికి చేరాయి. ఈ బియ్యం శ్రీగుండిచా మందిరం, అక్షయ పాత్ర ఫౌండేషన్ కార్యాలయం, పూరీ జిల్లా పౌర సరఫరా శాఖ గోదాంలో భద్రపరిచారు. శ్రీగుండిచా మందిరంలో 4,610.44 క్వింటాళ్లు, అక్షయ పాత్ర ఫౌండేషన్ ప్రాంగణంలో 2,618.07 క్వింటాళ్లు, పౌర సరఫరా శాఖ పూరీ జిల్లా గోదాంలో 6,788.72 క్వింటాళ్ల అర్పణ్ బియ్యం భద్రపరిచారు.

ముగిసిన పౌష్టికాహార మాసోత్సవం

జయపురం: స్థానిక ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ కేంద్రంలో జాతీయ పౌష్టికాహార మాసోత్సవం ముగింపు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ డైరెక్టర్ ప్రశాంత కుమార్ పరిడ మాట్లాడుతూ.. స్వామినాథన్ ఆశయాలు అమలు చేసి, పౌష్టికాహార ఉత్పత్తికి కృషి చేస్తామని వెల్లడించారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యం కోసం వివిధ రకాల విటమిన్ టాబ్లెట్స్‌కు బదులు, కాయగూరలు, ఆకుకూరలు ఆహారంలో తీసుకోవాలన్నారు. దీనిలో భాగంగా ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలు, కాయగూరలు, ఆకుకూరలను ప్రదర్శించారు. కార్యక్రమంలో వ్యవసాయ వైజ్ఞానికుడు డాక్టర్ కార్తీక చరణ్ లెంక, జయపురం అటవీ డివిజన్ అధికారి ప్రతాప్ కుమార్ బెహర, ప్రభుత్వ మత్స్య విభాగ అధికారి త్రివేణి పాత్రో, అదనపు జిల్లా కలెక్టర్ రాజ కిశోర్ దాస్, అదనపు జిల్లా సంక్షేమ అధికారి వైశాలీ దొర, సీడీపీవో కాంచన పండ, ఏబీడీవో మనోజ్ కుమార్ నాయిక్, బ్లాక్ విద్యాధికారి చందన కుమార్ నాయిక్, వైద్యాధికారి డాక్టర్ మనోలిస నాయిక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రశాంత కుమార్ పరిడ

మొబైల్ వైద్య సేవలు ప్రారంభం

రాయగడ: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సామాజిక బాధ్యత కార్యకలాపాల్లో భాగంగా సంజీవని పేరిట ఏర్పాటు చేసిన మొబైల్ వైద్య సేవల బస్సును కలెక్టర్ ఫరూల్ పట్వారి మంగళవారం జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సంచార వైద్య సేవల బస్సు గ్రామీణులకు వరంగా మారనుందని అభిప్రాయపడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఈ సంచార వాహనం ద్వారా మెరుగైన వైద్య సేవలు అందనున్నట్లు పేర్కొన్నారు. ఎస్‌బీఐ కో–ఆర్డినేటర్ బిష్ణు చరణ్ పండా మాట్లాడుతూ.. ఎస్‌బీఐ ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేసిన ఈ సంచార వాహనం ద్వారా జిల్లాలో 15 నెలల పాటు వైద్య సేవలను అందించనుందని వివరించారు. మొదటగా బిసంకటక్ సమితిలో రఘుబారి, ఆ పరిసర మరో 10 గ్రామాల్లో, అదేవిధంగా కల్యాణ సింగుపూర్ సమితిలోని పర్శాలి వంటి మారుమూల ప్రాంతాలతో పాటు మరో 10 గ్రామాల్లో సేవలందించనుందన్నారు. హాస్పిటల్ తరహా ఈ సంచార వైద్య వాహనంలో అన్ని రకాల వైద్య సేవలతో పాటు ఉచితంగా మందులు కూడా పంపిణీ చేసే సౌలభ్యం ఉందన్నారు.



సంచార వైద్య వాహనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ పట్వారీ

బహుముఖ ప్రజ్ఞాశాలి గంగాధర నందో

జయపురం: దివంగత గంగాధర నందో బహుముఖ ప్రజ్ఞాశాలి అని పలువురు కొనియాడారు. ప్రజ్ఞా భారతి వ్యవస్థాపకుడు డాక్టర్ గంగాధర నందో ప్రథమ వర్ధంతిని స్థానిక పంచానన మందిర ప్రాంగణంలో మంగళవారం గంగాధర స్మృతి కమిటీ నిర్వహించింది. సాహితీవేత్త డా.సురేష్ దాస్ దీనికి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా కోట్‌పాడ్ ఎమ్మెల్యే రూపుభొత్ర పాల్గొని గంగాధర నందో సేవలను గుర్తు చేసుకున్నారు. ఆయన ప్రాచీన సంస్కృతి, సాంప్రదాయాలను పరిరక్షించేందుకు ప్రజ్ఞా భారతి ద్వారా చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి, విద్యావేత్త, రచయిత శ్రీనాథ్ మిశ్ర, సాహితీవేత్తలు హరిహర సుధా పట్నాయక్, డా.జితేంద్ర పట్నాయిక్, డా.పరేష్ రథ్, లక్ష్మీకాంత మిశ్ర, సురేష్ నందో, పితాంబర దాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ గంగాధర నందో జీవిత చరిత్ర పుస్తకాన్ని విడుదల చేశారు.



నందో జీవిత చరిత్ర పుస్తకం విడుదల చేస్తున్న దృశ్యం

ముస్తాబవుతున్న మజ్జిగౌరి



అమ్మవారి ఆభరణాలు తీసుకొస్తున్న దృశ్యం

రాయగడ: దసరా ఉత్సవాలకు మజ్జిగౌరి అమ్మవారు ముస్తాబవుతున్నారు. తొమ్మిది రోజుల నవరాత్రుల్లో అమ్మవారు సునాబేసోలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఈ నేపథ్యంలో ఆలయ నిర్వాహకులు సన్నాహాలు చేపట్టారు. స్థానిక జిల్లా ట్రెజరీ కార్యక్రమంలో భద్రపరిచిన అమ్మవారి బంగారు ఆభరణాలను ప్రత్యేక పోలీసు బందోబస్తు మధ్య నిర్వాహకులు మంగళవారం మందిరానికి తీసుకొచ్చారు. బుధవారం రాత్రి అమ్మవారిని బంగారు ఆభరణాలతో అలంకరిస్తారు. ఈ మేరకు ఈ తొమ్మిది రోజులు అమ్మవారి మందిరంలో పోలీసులు గస్తీగా ఉంటారు. మందిరం మేనేజింగ్ ట్రస్టీ రాయిసింగి బిడిక, సభ్యులు ఇప్పిలి సన్యాసిరాజు, దేవేంద్ర బెహర, వడ్డాది శ్రీనివాస్‌రావు, మందిర ప్రధాన పూజారి చంద్రశేఖర్ బెరుకొ, సిబ్బంది ఆభరణాలను తీసుకొచ్చిన వారిలో ఉన్నారు.



మజ్జిగౌరి అమ్మవారు

ఉపాధ్యాయ నియామకాలు పూర్తి



ఒప్పంద పత్రాలపై సంతకాలు చేస్తున్న అభ్యర్థులు

రాయగడ: జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 511 మంది ఒప్పంద ఉపాధ్యాయుల నియామక ప్రక్రియ పూర్తయ్యింది. ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసుకుని నియామకాల గురించి ఎదురు చూసినవారి ఆశలు నెరవేరాయి. ఈ మేరకు స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాలలో జిల్లా అదనపు విద్యాశాఖ అధికారి భజన్‌ల్ మాఝి ఉపాధ్యాయుల ఒప్పంద పత్రాలపై సంతకాలను మంగళవారం తీసుకున్నారు. వీరు ఒప్పంద ఉద్యోగులుగా ఆరేళ్ల పాటు విధులను నిర్వహించనున్నారు. మొదటి మూడేళ్లు నెలకు రూ.11,100లు, మిగిలిన మూడేళ్లు రూ.20 వేల జీతం పొందుతారని పేర్కొన్నారు. ఎంపికైన ఉపాధ్యాయులను ప్రత్యేక బస్సులో భువనేశ్వర్‌కు తీసుకెళ్లనున్నారు. అక్కడ సీఎం మోహన్ చరణ్ మాఝి చేతులమీదుగా నియామక పత్రాలను అందజేస్తారు.



ఆందోళన చేస్తున్న నిరుద్యోగులు

పలువురి నిరసన

ఉపాధ్యాయుల నియామకాల్లో నిబద్ధత పాటించలేదని పలువురు నిరుద్యోగులు గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల వద్ద ప్లకార్డులతో ఆందోళన చేపట్టారు. రాయగడ సమితి వైస్ చైర్మన్ హరప్రసాద్ హెప్రుక నేతృత్వంలో వీరంతా ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల వారీగా ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టినప్పటికీ, ఇతర జిల్లాల అభ్యర్థులను రాయగడ జిల్లాలో నియమించడంపై తప్పుపట్టారు. ఇప్పటికైనా ఆ నియామకాలపై ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే నియమితులైన ఉపాధ్యాయలను బస్సుల్లో భువనేశ్వర్‌కు తీసుకెళ్లే కార్యక్రమాన్ని వ్యతిరేకించి అడ్డగిస్తామని హెచ్చరించారు.

చైన్ స్నాచింగ్‌కు యత్నం

రాయగడ: ఇంటి ఆవరణలో పరిశుభ్రం చేస్తున్న ఒక మహిళ మెడలో బంగారు గొలుసును గుర్తు తెలియని దుండగుడు తెంచుకొని వెళ్లేందుకు ప్రయత్నించాడు. ఆ మహిళ సకాలంలో స్పందించి చేతిలో ఉన్న చీపురుతో అతనిపై దాడి చేయడంతో పాటు మెడలో ఉన్న పుస్తెలను గట్టిగా పట్టుకుంది. అదే సమయంలో ఈ ఘటనను చూసిన చుట్టుపక్కల వారు కేకలు వేయగా దుండగుడు పారిపోయాడు. స్థానిక నెహ్రూ నగర్ రెండోలైన్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. బాధితురాలు ఎం.రజని తెలియజేసిన వివరాల ప్రకారం.. ఎప్పటిలాగే ఉదయం తన ఇంటి ఆవరణను శుభ్రపరుస్తున్న సమయంలో హఠాత్తుగా ఒక దుండగుడు తనపై దాడి చేశాడని, మెడలో ఉన్న మంగళ సూత్రాన్ని లాక్కునేందుకు ప్రయత్నించాడని చెప్పారు. దీనిపై సదరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఆ పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించారు. సీసీ ఫుటేజీ అధారంగా దుండగుడిని పట్టుకునేందుకు ప్రయత్నిస్తామని ఐఐసీ కేకేబీకే కుహరో తెలియజేశారు. ఇదిలా ఉండగా పట్టణంలో ఇటువంటి ఘటనలు తరచూ చోటుచేసుకోవడంపై మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొద్దిరోజుల క్రితం స్థానిక మెయిన్ రోడ్డులో పట్టపగలు ఇదే తరహా చోరీయత్నం జరిగింది. పోలీసులు దుండగులను పట్టుకునే విషయంలో ఎటువంటి పురోగతి సాధించలేకపోతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణంలోని అన్ని ప్రధాన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ ఫలితం శూన్యం.



సీసీ కెమెరాలో నిక్షిప్తమైన దృశ్యం



బాధితురాలు, ఆమె భర్త

క్లుప్తంగా

డివైడర్‌ను ఢీకొన్న కారు



ప్రమాదంలో దెబ్బ తిన్న కారు

భువనేశ్వర్: డివైడర్‌ని ఢీకొన్న కారు అవతలి వైపు రోడ్డులో ఉన్నటువంటి మరో మూడు వాహనాలను ఢీకొంది. ఈ ఘటన జేవీఆర్ కూడలి ప్రాంతంలో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. వీరంతా స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రాజేంద్ర ప్రసాద్ సెఠి అనే బాధితుడి పరిస్థితి విషమంగా ఉంది. గాయపడిన వారిలో ఒక మహిళ ఉన్నారు. వాహనాలను ఢీకొన్న కారు నుజ్జునుజ్జు అయింది.

నిబంధనలు పాటించాల్సిందే

బూర్జ: మండలంలోని మామిడివలస పంచాయతీ కాఖండ్యాం ఇసుక ర్యాంపును జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ మంగళవారం తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనలు విధిగా పాటించాలని సూచించారు. ఆన్‌లైన్ బుకింగ్, మాన్యువల్ బుకింగ్‌లో తేడాలు గమనించారు. రికార్డులు, ఇసుక స్టాక్ పాయింట్, తనిఖీల కేంద్రాలు పరిశీలించారు. ప్రైవేట్ బుకింగ్‌లు కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన (వేళలలోనే) సమయంలోనే ఇసుక రవాణాకు అనుమతులు ఇవ్వాలన్నారు. అవకతవకలు జరిగితే ఉపేక్షించేది లేదని చెప్పారు.

టెక్కలి పీఆర్ ఈఈ వేధింపులు సరికావు

అరసవల్లి: టెక్కలి పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఈఈగా విధుల్లో ఉన్న సూర్యప్రకాష్, శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులను వేధించడం తగదని పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు కిలారి నారాయణరావు, జెడ్పీ యూనిట్ అధ్యక్షురాలు పి.జయమ్మలు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. టెక్కలి ఈఈ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న శోభారాణిని టార్గెట్ చేసుకుని వేధింపులకు గురిచేస్తున్నారని, నిబంధనలకు విరుద్ధంగా పార్వతీపురం మన్యం జిల్లాకు బదిలీ చేశారని గుర్తుచేశారు. టెక్కలి పీఆర్ కార్యాలయంలో ఈఈ నుంచి ఉద్యోగులకు రక్షణ కల్పించాలని ఉన్నతాధికారులను కోరుతున్నామని వారు విజ్ఞప్తి చేశారు.

స్వర్ణాంధ్ర విజన్‌పై సూచనలివ్వండి

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్వర్ణాంధ్ర విజన్ రూపకల్పనలో ప్రజలందరూ భాగస్వాములై తమ అభిప్రాయాలను తెలపాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కోరారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్రణాళికను రూపొందించడంలో రాష్ట్రంలోనే శ్రీకాకుళం జిల్లా తొలి స్థానంలో నిలిచిందని, ఇంకా సమయం ఉన్నందున స్వర్ణాంధ్ర ప్రదేశ్ సాధనకు అవసరమైన సలహాలు సూచనలు అందించాలని అన్ని వర్గాలను కోరుతున్నట్టు చెప్పారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌తో కలసి రెవెన్యూ ఫ్రీ హోల్డ్ సర్వే, కోర్టు కేసులు, రీ ఓపెన్ గ్రీవెన్స్, ఓటర్ల జాబితా రూపకల్పన, స్వచ్ఛతా హీ సేవ, ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ, ఉపాధి హామీ పనులు, 100 రోజుల ప్రగతి మొదలైన అంశాలపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మీ కోసంలో వచ్చే ఫిర్యాదులను సరైన కారణాలు లేకుండా తిరస్కరించవద్దని, రీ ఓపెన్ చేసిన అర్జీలను నిశితంగా పరిశీలించి అవసరమైన సందర్భంలో ఆయా అర్జీదారులతో వ్యక్తిగతంగా మాట్లాడి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. మన ఇళ్లు మన గౌరవం హౌసింగ్ కార్యక్రమంలో ప్రతివారం కచ్చితమైన పురోగతి ఉండాలన్నారు.

మానిటరింగ్ సభ్యులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులుగా చేరేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారిత అధికారి విశ్వమోహనరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కమిటీలో సభ్యులుగా షెడ్యూల్డ్ కులం, షెడ్యూల్డ్ తెగలకు చెందిన అభ్యర్థులు ఐదుగురిని, ప్రభుత్వేతర సంస్థల ప్రతినిధులు బీసీ, ఓసీ కులాలకు చెందిన ముగ్గురిని నియమించనున్నట్లు పేర్కొన్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

వజ్రపుకొత్తూరు రూరల్: బెండిగేటు జంక్షన్‌లో మంగళవారం ఓ మహిళ మెడలో ఉన్న బంగారం గొలుసును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు ఏఎస్ఐ జిన్నారావు తెలిపారు. ఉద్దానం మెళియాపుట్టి గ్రామానికి చెందిన బొమ్మాళి సరోజనమ్మ తన భర్త లక్ష్మయ్యతో కలిసి స్వగ్రామం నుంచి గరుడఖండి వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఈ సంఘటన చోటు చేసుకుంది. గుర్తు తెలియని వ్యక్తి బాధితురాలు మెడలో ఉన్న తులంనర బంగారం గొలుసును ఒక్కసారిగా తెంపుకొని వెళ్లిపోయాడు. చుట్టుపక్కల గాలించినా అతడు దొరకలేదు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కొర్లాం సమీపంలో..

సోంపేట: కొర్లాం జాతీయ రహదారి వద్ద మంగళవారం సాయంత్రం చోరీ జరిగింది. గ్రామానికి చెందిన కలిపిల్లి పుణ్యావతి పొలం పనులు చూసుకుని ఇంటికి వెళ్తుండగా ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి ఆమె మెడలో ఉన్న మూడు తులాల పుస్తెల తాడును తెంపుకుని వెళ్లిపోయారు. ఆమె కేకలు వేసినా ప్రయోజనం లేకుండా పోయింది. బారువ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.



పర్లాకిమిడి: పింఛన్ కార్డులతో వృద్ధులు



కొరాపుట్: వృద్ధులను సత్కరిస్తున్న దృశ్యం



రాయగడ: ప్రసంగిస్తున్న మహంతి, వేదికపై టున్ని, సాహు తదితరులు

వృద్ధుల అనుభవాలు ప్రగతికి మార్గదర్శకాలు



పర్లాకిమిడి: శతాధిక వృద్ధుడు లక్ష్మీచరణ్ పట్నాయిక్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ బిజయ్ కుమార్



జయపురం: వేదికపై సబ్ కలెక్టర్ శౌశ్య రెడ్డి, ఎస్డీపీవో వర్మ, చైర్మన్ మహంతి తదితరులు

- ఘనంగా ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవం

జయపురం: వయో వృద్ధుల అనుభవాలు సమాజ ప్రగతికి మార్గదర్శకాలు అని మున్సిపల్ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి అన్నారు. పట్టణంలోని కెల్లా నగర్ జయపురం సీనియర్ సిటిజన్ కమిటీ కార్యాయంలో ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి యువత వృద్ధులను ఆదర్శంగా తీసుకొని ముందుకు నడవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ వారిని గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. జేసీసీ అధ్యక్షుడు ఎం.కె.మిశ్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వయో వృద్ధులు భీమసేన్ దొళాయి, బిఘ్నరాజ్ రథ్, పుష్పలత మిశ్ర, లక్ష్మీసాహు, డాక్టర్ ఏకలవ్య పాణిగ్రాహిను సన్మానించారు. అనంతరం జేసీసీ కమిటీ వృద్ధుల సంక్షేమ నిధికి రూ.50 వేలు విరాళంగా అందజేసింది. కార్యక్రమంలో జయపురం సబ్ కలెక్టర్ ఎ.శౌశ్య రెడ్డి, జయపురం సబ్ డివిజన్ పోలీసు అధికారి అంకిత కుమార్ వర్మ, కమిటీ సలహాదారు డా.సురేష్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

పర్లాకిమిడి: స్థానిక సమిటియా వీధిలో ఉన్న పద్మశ్రీ సత్యనారాయణ రాజగురు ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు చేపట్టారు. విశ్రాంత ప్రిన్సిపాల్ డా.శివరామ కృష్ణను పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు నబకిశోర్ పటాన్యాయిక్ సత్కరించారు. కార్యక్రమంలో గజపతి ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పోట్నూరు సూర్యారావు, అధ్యాపకుడు గజేంద్ర పండా తదితరులు పాల్గొన్నారు.



పర్లాకిమిడి: మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని మిషన్ శక్తి సమావేశ మందిరంలో వయో వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రో 80 ఏళ్లు దాటిన ఇద్దరు వృద్ధులను సన్మానించారు. సమాజంలో వృద్ధులకు గౌరవం ఇవ్వాలని మున్సిపల్ చైర్మన్ కును నాయక్ పిలుపునిచ్చారు. వృద్ధులు నవ్వుతూ ఆరోగ్యం పరిరక్షించుకోవాలని ఏడీఎం మహేశ్వర్ నాయక్ సూచించారు.

రాయగడ: స్థానిక సమితి కార్యాలయం సమావేశ మందిరంలో అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ప్రముఖ విద్యావేత్త డాక్టర్ డీకే మహంతి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పెద్దలను, వారి అనుభవాలను గౌరవించాలన్నారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షురాలు టున్ని హాయిక, లక్ష్మీనారాయణ సాహు, జిల్లా పరిషత్ సభ్యురాలు సంధ్యా పులక తదితరులు పాల్గొన్నారు.

పర్లాకిమిడి: వయో వృద్ధులను మనం గౌరవించాలని కలెక్టర్ బిజయ కుమార్ దాస్ అన్నారు. స్థానిక బిజూ కల్యాణ మండపంలో వయో వృద్ధుల యోగా, మెడికల్ క్యాంపును మంగళవారం ప్రారంభించారు. ఉచిత మెడికల్ క్యాంపులో 47 మంది వయో వృద్ధులకు షుగరు, బీపీ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా 10 మందికి వృద్ధాప్య పింఛన్లు అందజేశారు. అలాగే మరో ఐదుగురు సీనియర్ సిటిజన్లను సత్కరించారు. కార్యక్రమంలో సీడీఎంవో డాక్టర్ మహ్మద్ ముబారక్ అలీ, డీఆర్‌డీఏ అధికారి గుణనిధి నాయక్, సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహా రోథో, ఆశాలత అమ్మన్న తదితరులు పాల్గొన్నారు.



జయపురం: ఏకలవ్య పాణిగ్రాహిని సన్మానిస్తున్న దృశ్యం



పర్లాకిమిడి: సీనియర్ సిటిజన్ల యోగాసనాలు



పర్లాకిమిడి: వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం



జయపురం: పుష్పలత మిశ్రకు సన్మానం



జయపురం: బిఘ్నరాజ్ రథ్‌ను సన్మానిస్తున్న సభ్యులు

లోహ పాత్రల్లో మహా ప్రసాదం

- ముగ్గురు సేవకులపై చర్యలు

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథుని సంస్కృతి పర్యావరణ పరిరక్షణకు ఆలవాలం. దైనందిన నిత్య కార్యకలాపాలు, ఉత్సవాదుల్లో సైతం ఈ ఆచారం కట్టుదిట్టంగా నిరవధికంగా కొనసాగుతుంది. శ్రీజగన్నాథుని సంస్కృతిలో మహా ప్రసాదం ప్రాముఖ్యత అనన్యం. ఈ పరంపరలో ఇటీవల తప్పిదం జరగడం భక్తజన హృదయాలను కలచి వేసింది. తరతరాల సంప్రదాయం పరంపరకు భంగం కలగడంపై శ్రీమందిరం పాలక వర్గం ఘాటుగా స్పందించి సత్వర చర్యలకు నడుం బిగించింది. బాధ్యులైన ముగ్గురు సూపకారు సేవకులపై చర్యలు చేపట్టింది. వీరిని శ్రీమందిరం పరిసరాలు, పోటు ప్రాంగణంలోకి ప్రవేశం నిషేధించినట్లు ప్రకటించారు. వీరిలో ఒకరు పాలియా సేవకుడు. ఆచారం ప్రకారం రత్న వేదికపై కొలువుదీరిన మూల విరాటుల దైనందిన సేవల్లో పాల్గొనాల్సిన విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు శ్రీమందిరం ప్రధాన పాలన అధికారి(సీఏఓ) డాక్టర్ అరవింద కుమార్ పాఢి తెలిపారు.

లోహపు పాత్రలో వండినట్లు ఆరోపణ

ఈ ఏడాది సెప్టెంబర్ 12వ తేదీన లోహపు పాత్రలో అన్నం వండినట్లు ఆరోపణ వెలుగు చూసింది. ఈ సంఘటనపై విచారణకు నిమిత్తం లోహపు పాత్రలను స్వాధీనం చేసుకోవాలని సీఏవో ఆదేశించారు. సువార్ మహా సువార్ నియోగులు, బిడువా పాంతి బొడు నియోగులు, రోష పాయికా నియోగుల సంఘం కార్యదర్శి పోటు ప్రత్యక్షంగా సందర్శించి లోహపు పాత్ర స్వాధీనపరచుకుని, సమగ్ర నివేదిక దాఖలు చేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. పట్టజోషి మహాపాత్రో, తొలిచ్చొ మహాపాత్రో, దెవులా కొరొణా వర్గీయులు నిత్యం పోటు పర్యవేక్షించి ప్రసాదాల వంటకాల్లో లోహపు పాత్రల వినియోగంపై నిఘా వేయాలని ఆదేశించారు. లోహపు పాత్ర వినియోగం తప్పిదానికి పాల్పడిన నిందిత సేవాయత్‌ని గుర్తించి సముచిత కార్యాచరణ ప్రక్రియని ప్రతిపాదించాలని శ్రీమందిరం కమాండర్, సీనియర్ సూపర్‌వైజర్‌కు ఆదేశాలు జారీ చేశారు. వీరంతా దాఖలు చేసిన నివేదిక ఆధారంగా బాధ్యులైన వారిపై మంగళవారం చర్యలు తీసుకున్నారు.

కోవిడ్ సమయంలో వినియోగం

కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో మట్టి పాత్రల కొరత తలెత్తడంతో తాత్కాలిక సర్దుబాటుగా లోహపు పాత్రలను వినియోగించేందుకు అనుమతించారు. కానీ అనంతరం వీటి వినియోగాన్ని నిషేధించారు. అయితే ఇటీవల లోహపు పాత్రలు వినియోగించినట్లు తేలడంతో ఆలయ చట్టం ప్రకారం బాధ్యులైన వారి వ్యతిరేకంగా చర్యలు చేపట్టారు.

హబిషాలి కార్తీక వ్రతం ఏర్పాట్లు

భువనేశ్వర్: ఏటా మాదిరిగా పవిత్ర కార్తీక మాసం పురస్కరించుకుని హబిషాలీలు దీక్షతో నెల రోజుల పాటు వ్రతం నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తుంది. కార్తీక మాసంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి హబిషాలీలు శ్రీజగన్నాథుని సన్నిధి శ్రీక్షేత్రం చేరుతారు. ఈ ప్రాంతంలో నెల రోజులపాటు బస చేసి దీక్షతో వ్రతం నిరవధికంగా కొనసాగిస్తారు. వీరి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సదుపాయాలు కల్పించనుంది. దీని వ్యయ ప్రణాళిక రూ. 2,57,50,000లుగా రాష్ట్ర ఒడియా భాష, సంస్కృతి, సాహిత్యం విభాగం మంత్రి సూర్య వంశీ సూరజ్ తెలిపారు. హబిషాలీలు నెల రోజులపాటు బస చేసేందుకు ఉచిత వసతి, శ్రీజగన్నాథుని సులభ దర్శనం, మహా ప్రసాదం, దేవస్థానం రాకపోకల కోసం ఉచిత రవాణా, వసతి శిబిరాల్లో వైద్య, ఆరోగ్య శిబిరాలతో సురక్షిత అగ్నిమాపక వ్యవస్థ వగైరా సదుపాయాలు కల్పిస్తున్నారు. నిత్యం ఆధ్యాత్మిక, ధార్మిక కాలక్షేపానికి భజన, సంకీర్తనాలాపాన వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. ఔత్సాహిక కార్తీక మాసం వ్రతం దీక్షకులు ముందస్తుగా ఆన్‌లైన్‌లో తమ పూర్తి వివరాల్ని నమోదు చేసుకోవాలని మంత్రి తెలిపారు.

కన్న బిడ్డని విక్రయించిన తండ్రి

భువనేశ్వర్: పేదరికం తాళలేక ఒక తండ్రి కన్న బిడ్డని విక్రయించిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. జాజ్‌పూర్ జిల్లాలో ఈ విచారకర సంఘటన చోటు చేసుకుంది. నెలన్నర రోజుల మగ బిడ్డని కన్న తండ్రి నామమాత్రంగా రూ.7 వేలకు విక్రయించాడు. ఈ పరిస్థితిని తట్టుకోలేని కన్న తల్లి ఠాణాలో పోలీసులను ఆశ్రయించింది. చైల్డ్‌లైన్ వర్గీయుల సమన్వయ సహకారంతో పోలీసులు కన్న బిడ్డని అదుపులోకి తీసుకున్నారు. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. జాజ్‌పూర్ జిల్లా కొరై ప్రాంతంలో కార్మికులుగా జీవనం గడుపుతున్న దంపతులకు పుత్ర సంతానం పోషణ భారంగా పరిణమించడంతో తండ్రి ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు ప్రాథమిక సమాచారం. బిడ్డని చైల్డ్‌లైను అధీనంలో సురక్షితంగా సంరక్షిస్తున్నారు. కేసు విచారణ కొనసాగుతోంది.

ఆరోగ్య కేంద్రంలో ఆకస్మిక తనిఖీలు

పర్లాకిమిడి: గురండి బ్లాక్ ఆరోగ్య కేంద్రాన్ని పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. దీనిలో భాగంగా ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లు, మందుల కొరత అధికంగా ఉన్నట్లు గమనించారు. ఈ విషయాన్ని అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావిస్తానని తెలిపారు. ఆయనతో పాటు గుసాని బీడీవో గౌరచంద్ర పట్నాయిక్, గుసాని సమితి అధ్యక్షుడు ఎస్.వీర్రాజు, గురండి స్వస్థ్య కేంద్ర అధికారి మమాతా పాఢి తదితరులు ఉన్నారు.



పీహెచ్‌సీలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రూపేష్

నరేంద్ర సరోవరంలో ఇద్దరు యువకుల మృతి

భువనేశ్వర్: పూరీ నరేంద్ర సరోవరంలో మునిగి ఇద్దరు యువకులు మృతి చెందారు. వీరిరువురు స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీట మునిగి ప్రాణాలు కోల్పోయినట్లు ప్రత్యక్ష సాక్షుల కథనం. అగ్నిమాపక సిబ్బంది గాలించి యువకుల మృతదేహాలను ఒడ్డుకు చేర్చారు. మృతులు ఆంధ్రప్రదేశ్‌లోని ఇచ్ఛాపురానికి చెందిన నలినీకాంత త్రిపాఠి, గంజాం జిల్లా కుకుడాఖండిచి చెందిన రాజ కిషోర్ శత్పతిగా గుర్తించారు.



నరేంద్ర సరోవరం

జంట హత్యల కేసులో ఊరట

భువనేశ్వర్: బిజూ జనతా దళ్ నాయకుడు, మాజీ మంత్రి ప్రతాప్ జెనాకు జంట హత్యల కేసులో ఊరట కలిగింది. ఈ కేసు విచారణలో రాష్ట్ర హైకోర్టు ఆయనను నిర్దోషిగా ప్రకటించింది. లోగడ దిగువ న్యాయ స్థానం జంట హత్యల కేసులో ఆయనకు శిక్షార్హుడిగా పరిగణించాల్సి ఉందని తీర్మానించింది. ఈ తీర్పుని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. సాలేపూర్ ప్రథమ శ్రేణి జుడిషియల్ మేజిస్ట్రేటు కోర్టు జారీ చేసిన తీర్పుని సవాలు చేసి మాజీ మంత్రి హైకోర్టుని ఆశ్రయించారు. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో విచారణ పూర్తి చేసిన ఉన్నత న్యాయస్థానం తుది తీర్పు వెల్లడి అప్పట్లో వాయిదా వేసింది.

ఇదీ విషయం

2021వ సంవత్సరం జనవరి 2వ తేదీన కటక్ జిల్లా మహంగా మండలం అధ్యక్షుడు, భారతీయ జనతా పార్టీ అభ్యర్థి కులమణి బొరాల్ (75), అతని సహచరుడు దిబ్యసింగ్ బొరాల్ (80) మోటార్ సైకిల్‌పై ఇంటికి వస్తుండగా మహంగా తహసీల్‌లోని జంకోటి గ్రామ సమీపంలో గుర్తు తెలియని దుండగులు నరికి చంపారు.

ఈ సంఘటనలో ప్రధాన నిందితుడు ప్రఫుల్ల బిస్వాల్‌ని టంగి ప్రాంతం గోవింద్‌పూర్ సమీపంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ కేసులో విచారణ జరిపిన కటక్ జిల్లా సాలేపూర్ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి న్యాయస్థానం 9 మందికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పు వెల్లడించింది.

సినిమా షూటింగ్‌లు నిషేధం

భువనేశ్వర్: రాష్ట్రంలో మావో ప్రభావిత ప్రాంతాల్లో సినిమా షూటింగులు నిషేధించినట్లు బొలంగీరు జిల్లా యంత్రాంగం తెలిపింది. మావోల కదలికపై పొంచి ఉన్న ముప్పు ప్రేరేపిత పరిస్థితుల దృష్ట్యా ఈ మేరకు నిర్ణయించినట్లు వివరించారు. ఈ మేరకు ఇంటెలిజెన్సు విభాగం నుంచి సమాచారం అందినట్లు బొలంగీరు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ మంగళవారం తెలిపారు.

ప్రధానంగా బొలంగీరు జిల్లా రొమండా, ఖరిపాణి ప్రాంతాల్లో సినిమా షూటింగులు నివారించారు. హరిశంకర్ ప్రాంతంలో సినిమా షూటింగు జరుగుతున్నట్లు అందిన సమాచారంపై యంత్రాంగం నిఘా వేసినట్లు తెలిపారు.

పాఠశాలలో సోలార్ పరికరాల దొంగతనం

జయపురం: దశమంతపూర్ సమితి ఉల్ల పంచాయతీ ప్రాథమిక పాఠశాలలో సోలార్ పరికరాలు దొంగతనానికి గురయ్యాయి. దొంగిలించబడిన సోలార్ పరికరాల విలువ సుమారు రూ.5 లక్షలు ఉంటుందని పాఠశాల వర్గాలు వెల్లడించాయి. ఈ మేరకు పాఠశాల హెచ్‌ఎం గౌరంగ సేనాపతి దశమంతపూర్ పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. పోలీసు అధికారి సుకుమ హంసద ఆదేశాల మేరకు అదనపు పోలీసు అధికారి సునీల్ కుమార్ స్పై నేతృత్వంలో దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిసింది. గ్రామానికి దూరంగా ఉన్న పాఠశాలలో విద్యార్థుల తాగునీటి కోసం బోర్ వేయించి, సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేసినట్లు హెచ్‌ఎం పేర్కొన్నారు. తద్వారా విద్యార్థులకు తాగునీరు సమకూర్చడంతో పాటు మధ్యాహ్న భోజన పథకం వంటలకు నీరు వినియోగిస్తున్నామన్నారు. అయితే ఇప్పుడు దొంగతనానికి గురవ్వడంతో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.



సోలార్ పరికరాలు దొంగతనం జరిగిన ప్రాంతం

రూ.7 లక్షలు కొట్టేసిన సైబర్ కేటుగాళ్లు

కొరాపుట్: సామాన్యులే టార్గెట్‌గా సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. నబరంగ్‌పూర్ జిల్లా పపడాహండి సమితి సెమ్లా పంచాయతీ పాయక పుత్ర గ్రామానికి చెందిన కిషోర్ చంద్ర హరిజన్ అనే వ్యాపారి ఖాతాల్లో సుమారు రూ.7 లక్షలు కొట్టేశారు. అతడికి పపడాహండి సమితి కేంద్రంలో ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకుల్లో ఉన్న ఖాతాలు నుంచి రూ.7 లక్షలు మాయమయ్యాయి. గత నెల 22వ తేదీ నుంచి 30వ తేదీల మధ్య అతని ఖాతాల నుంచి విడతల వారీగా ఫ్రాడ్ అకౌంట్స్‌కు బదిలీ అయ్యాయి. ఇది గ్రహించిన బాధితుడు బ్యాంక్‌లకు వెళ్లి పరిశీలించి బోరుమన్నాడు. రూ.5 వేలు నుంచి రూ.40 వేలు వరకు విడతల వారీగా నగదు బదిలీ అయినట్లు గుర్తించారు. మైదల్‌పూర్, పపడాహండి పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశాడు. ఎందువలన అలా జరిగింది అనేది తెలియడం లేదని వాపోయాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు.



బాధితుడు కిషోర్ చంద్ర హరిజన్

జిల్లా జైలు సందర్శన



ఖైదీలతో సంభాషిస్తున్న కలెక్టర్ శుభశంకర్ తదితరులు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో ఉన్న సబ్ జైలుని జిల్లా కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రో మంగళవారం సందర్శించారు. జిల్లా న్యాయమూర్తులు, సంక్షేమ శాఖ అధికారులతో కలిసి వెళ్లారు. అక్కడ రిమాండ్ ఖైదీలకు అందుతున్న ఆహారం, వసతి, ఆరోగ్య పరిస్థితుల గూర్చి అడిగి తెలుసుకున్నారు. పలు బ్యారక్‌లను ఆకస్మికంగా పరిశీలించారు.

భద్రక్‌లో డీజీపీ పర్యటన

భువనేశ్వర్: భద్రక్ ప్రాంతంలో సోషల్ మీడియాలో వివాదస్పద ప్రసారంతో తీవ్ర అలజడి చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ పరిస్థితుల నియంత్రణ కోసం స్థానిక జిల్లా యంత్రాంగం ఇంటర్నెట్ బంద్ చేసి ఫేస్‌బుక్ ఇతరేతర సోషల్ మీడియా వేదికల ప్రసారాలకు కళ్లెం వేసింది. దీంతో ఈ పరిస్థితిని సమీక్షించేందుకు రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ వై.బి.ఖురానియా ప్రత్యక్షంగా ప్రభావిత ప్రాంతాలను మంగళవారం సందర్శించారు. ఇక్కడి పరిస్థితులు క్రమంగా సాధారణ స్థితికి చేరుకుంటున్నాయని తెలిపారు. సాధారణ ప్రజలు భయాందోళనకు గురవ్వాల్సిన పరిస్థితులు తొలగిపోయినట్లు పేర్కొన్నారు. సోషల్ మీడియా ప్రసారాల్లో బూటకపు సమాచారంపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ప్రభావిత ప్రాంతాల సందర్శనలో భాగంగా ధామ్‌నగర్, ధామ్‌నగర్ ప్రాంతాల్లో సీనియర్ పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. పోలీసులపై దాడి నేరం కింద 27 మంది నిందితుల్ని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. వీరిలో భద్రక్ నుంచి 10 మంది, ధామ్‌నగర్ నుంచి 17 మంది ఉన్నట్లు తెలిపారు. దుమారం ప్రేరేపిత పాత బజారు, ధామ్ నగర్ నోటిఫైడ్ ఏరియా కౌన్సిల్ మరియు దోబల్ ప్రాంతాల్లో లోగడ జారీ చేసిన ఆంక్షలు యథాతథంగా కొనసాగుతాయని స్పష్టం చేశారు.

ఈ ప్రాంతాల్లో నిత్యం ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు దుకాణాలు తెరిచేందుకు అనుమతించారు. మొబైలు, ఇంటర్నెట్టు సేవలు నిలిపివేత కొనసాగుతుందన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం భద్రక్ ప్రాంతంలో 12 ప్లాటూన్ల పోలీసులతో ఒక కంపెనీ ర్యాపిడ్ యాక్షన్ ఫోర్సుని నియమించారు. ధామ్ నగర్‌లో 6 ప్లాటూన్ల పోలీసులు, ఒక కంపెనీ ర్యాపిడ్ యాక్షన్ ఫోర్సుని రంగంలోకి దింపారు.



భద్రక్‌లో మాట్లాడుతున్న డీజీపీ ఖురానియా

క్లుప్తంగా

ఏపీ చెస్ అసోసియేషన్ సీఈఓగా జ్వాలాముఖి



ఏపీ చెస్ అసోసియేషన్ సీఈఓగా నియామకమైన జ్వాలాముఖి

విజయనగరం: ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ సీఈఓగా విజయనగరానికి చెందిన కేవీ.జ్వాలాముఖి నియమితులయ్యారు. ప్రస్తుతం చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయనకు ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ కీలక బాధ్యతలు అప్పగించింది. ఇటీవల విజయవాడలో ఆలిండియా చెస్ ఫెడరేషన్, స్పోర్ట్స్ అథారిటీ సమక్షంలో నిర్వహించిన ఎన్నికల్లో జ్వాలాముఖికి ఈ బాధ్యతలు అప్పగించారు. అంతేకాకుండా జిల్లాకు చెందిన కేకే.జగన్నాథం కోశాధికారిగా ఎన్నికయ్యారు. నూతనంగా నియమితులైన ఆ ఇద్దరూ మాట్లాడుతూ చెస్ క్రీడలో విజయనగరం జిల్లాను దేశంలోనే అగ్రస్థాయిలో నిలబెట్టేందుకు కృషి చేస్తామని చెప్పారు.

లైంగిక దాడికేసులో 22 ఏళ్ల జైలుశిక్ష

బొబ్బిలి: ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి వివాహితపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి జిల్లా కోర్టు న్యాయమూర్తి 22 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ ఇచ్చిన తీర్పు సంచలనంగా మారింది. ఈ తీర్పు మేరకు బొబ్బిలి సీఐ సతీష్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని పాత బొబ్బిలి గ్రామంలో 2020 మార్చి 1వ తేదీన గ్రామానికి చెందిన డొంక రమేష్ అదే గ్రామానికి చెందిన బాధితురాలి భర్త లేని సమయంలో ఇంట్లో ప్రవేశించి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు.ఈ సంఘటనపై అప్పటి సీఐ కేశవరావుకు బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్షులను విచారించిన న్యాయస్థానం నేరం నిరూపితం కావడంతో జిల్లా 5వ ఏడీజే, ఉమెన్ కోర్టు న్యాయమూర్తి ఎన్.పద్మావతి మంగళవారం తుదితీర్పును వెలువరించారు.ఈ కేసులో ముద్దాయి డొంక రమేష్‌కు 22ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధించారని సీఐ సతీష్ తెలిపారు.ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఎం రవీంద్రనాథ్ వాదనలు వినిపించగా సకాలంలో సాక్షులను ప్రవేశపెట్టి సహకరించిన హెడ్‌కానిస్టేబుల్ సీహెచ్ స్వామినాయుడులను సీఐ అభినందించారు.

గంజాయికేసులో ముగ్గురికి రిమాండ్

పాచిపెంట: గంజాయి కేసులో ముగ్గురికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై వెంకట సురేష్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ, మండలంలోని పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద సోమవారం ఓ యువకుడు, ఇద్దరు యువతులు అనుమానాస్పదంగా తుప్పల్లోకి వెళ్లడాన్ని పోలీసులు గమనించి వారిని పట్టుకున్నారన్నారు. వారి వద్ద బ్యాగులు తనిఖీ చేసి, ఆ బ్యాగుల్లో 14.5 కిలోల గంజాయిని గుర్తించి వారిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. నిందితుల్లో యువకుడిది ఉత్తరప్రదేశ్ రాష్ట్రం కాగా, యువతులు ఒడిశాలోని సిమిలిగుడకు చెందినవారని చెప్పారు.

జాతీయ క్రీడా పోటీలకు పారాది విద్యార్థులు



జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పీడీ, హెచ్‌ఎం

బొబ్బిలి రూరల్: మండలంలోని పారాది గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి సాఫ్ట్‌బల్ క్రీడా పోటీలకు ఎంపికయ్యారని పీడీ వెంకటనాయుడు తెలిపారు. సాఫ్ట్‌బాల్ జూనియర్ విభాగంలో ఈనెల 7నుంచి కర్నూలులో జరగనున్న పోటీల్లో పాఠశాలకు చెందిన బెల్లాన సుప్రియ, అల్లాడ తేజస్విని, పి.చైతన్యలు పాల్గొంటారని చెప్పారు. జాతీయ క్రీడలకు ఎంపికైన విద్యార్థులకు హెచ్‌ఎం నాగేశ్వరావు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఇతర జిల్లాలకు బదిలీలు నిలిపివేయాలి

గుమ్మలక్ష్మీపురం/పార్వతీపురం: జిల్లాలోని గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస, కొమరాడ మండలాల్లో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలను రాజకీయ ఒత్తిళ్లతో ఇతర జిల్లాలకు చేసిన బదిలీలను తక్షణమే నిలిపివేయాలని ఆదివాసీ సంఘాల (ఐకాస) నాయకులు ఆరిక చంద్రశేఖర్, పల్లా సురేష్, ఇంటికుప్పల రామకృష్ణ, పాలవలస భగవాన్, కిల్లక హరికృష్ణ, రాయల సోములు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో గిరిజనులే విధులు నిర్వర్తించాలని వారి నియామక జీవోలో ఉన్నప్పటికీ..దానికి వ్యతిరేకంగా, రాజకీయాలకు అనుకూలంగా పంచాయతీ సెక్రటరీలు, వీఆర్వోల బదిలీలు ఉన్నాయని ఆరోపించారు.

ఆడుకునే వయస్సులో అమ్మలు

- టీనేజ్‌లో గర్భం దాలుస్తున్న బాలికలు
- యుక్త వయసులో గర్భంతో ఆరోగ్య సమస్యలు
- ప్రసవ సమయంలో ఇబ్బంది
- మాతాశిశు మరణాలు సంభవించే ఆస్కారం
- 5 నెలల్లో రిజిస్టర్ అయిన 11662 మంది గర్భిణులు
- వారిలో 246 మంది టీనేజ్ యువతులే



బాలింతలు (ఫైల్)

విజయనగరం ఫోర్ట్: మేలిమి బంగారు తల్లులు..కలువ కన్నుల కన్నెలు..పిల్లలు కంటున్న అమ్మలు..దుష్ట సంప్రదాయానికి అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఆడుకోవాల్సిన టీనేజ్ (యుక్తవయస్సు)లోనే గర్భం దాల్చుతుండడం వల్ల ప్రసవ సమయంలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. తోటి పిల్లలతో చెంగుచెంగున గంతులేయాల్సిన వయస్సులోనే పెళ్లిళ్లయిపోవడంతో వెంటనే గర్భం దాల్చి పిల్లలకు తల్లులవుతున్నారు. తల్లిదండ్రుల సంరక్షణలో ఉండాల్సిన వారు పిల్లలకు సంరక్షించే బాధ్యతలు చేపడుతున్నారు. చదువుకోవాల్సిన వయస్సులో భర్త, పిల్లలకు సపర్యలు చేసే పనిలో నిమగ్నమవుతున్నారు. 18ఏళ్లు నిండిన తర్వాత ఆడపిల్లకు వివాహం జరగాల్సి ఉండగా 18 ఏళ్ల వయస్సు వచ్చే నాటికే పిల్లలకు వారు తల్లులవుతున్నారు. తక్కువ వయస్సులో గర్భం దాల్చి ప్రసవించిన తర్వాత తల్లులవడం వల్ల రక్తహీనత, నడుంనొప్పి, నీరసం, పనిపట్ల ఆశక్తి చూపించలేకపోవడం, బీపీ ఎక్కువ కావడం తదితర సమస్యలు వారిని వేధిస్తున్నాయి. అన్నింటికంటే ముఖ్యంగా మాతాశిశు మరణాలు సంభవించే పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి.

టీనేజ్‌లో గర్భంతో సమస్యలు

- పిల్లలు బలహీనంగా పుడతారు.
- పుట్టే పిల్లలకు మానసిక, శారీరక ఎదుగుదల ఉండదు.
- వ్యాధినిరోధక శక్తి తగ్గిపోతుంది. దీని వల్ల వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంటుంది.
- శిశువులు ఆకస్మాత్తుగా చనిపోయే ప్రమాదం ఉంటుంది.
- ప్రసవ సమయంలో తల్లులు ఇబ్బంది పడతారు.
- బిడ్డ బరువు తక్కువగా పుడతాడు.
- పుట్టిన పిల్లలను తల్లులు సరిగా చూసుకోలేరు.

ఏడాదిలో 25 వేల వరకు ప్రసవాలు

జిల్లాలో ఏడాదికి 25 వేల వరకు ప్రసవాలు ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో జరుగుతాయి. జిల్లాలో 48 పీహెచ్‌సీలు, 8 సీహెచ్‌సీలు, ఘోషా ఆస్పత్రి, 60 వరకు ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఉండగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో 14 వేల వరకు, ప్రైవేట్ ఆస్పత్రుల్లో 11 వేల వరకు ప్రసవాలు జరుగుతాయి.

బిడ్డ ఎదుగుదల ఉండదు



టీనేజ్‌లో గర్భం దాల్చడం వల్ల తల్లీబిడ్డల్లో ఎవరో ఒకరు మరణించే ప్రమాదం ఉంది. ఒక్కోసారి ఇద్దరు మరణించే పరిస్థితి లేకపోలేదు. గర్భద్వారం తయారుకాకపోవడం వల్ల ప్రసవ సమయంలో ఇబ్బంది పడతారు. బీపీ ఎక్కువవుతుంది. రక్తహీనత బారిన పడతారు. పుట్టే బిడ్డకు ఎదుగుదల ఉండదు.

– డాక్టర్ అరుణ శుభశ్రీ, గైనకాలజీ హెచ్‌ఓడీ, ఘోషా ఆస్పత్రి

5 నెలల్లో 11,662 మంది రిజిస్టర్

గడిచిన ఐదు నెలల్లో వేలాది మంది గర్భిణులు జిల్లాలో రిజిస్టర్ అయ్యారు. వారిలో వందల సంఖ్యలో టీనేజ్ వారు ఉన్నారు. 2024 ఏప్రిల్ నుంచి ఆగస్టు నెలాఖరు నాటికి జిల్లాలో 11,662 మంది రిజిస్టర్ కాగా వారిలో 246 మంది టీనేజ్‌లోనే గర్భం దాల్చిన వారుండడం విచారకరం.

రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం జ్ఞానశంకర్, సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు నెల్లిమర్ల మండలంలోని కొండవెలగాడ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్‌ఎం జ్ఞానశంకర్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఆవరణలో మంగళవారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల జిల్లా స్థాయిలో జరిగిన రెజ్లింగ్ పోటీల్లో తమ విద్యార్థులు సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని పేర్కొన్నారు. విజయవాడలో ఈ నెల 3 నుంచి జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వారు తలపడతారని చెప్పారు. తమ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు తూడెం విద్యార్థులు



జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

భోగాపురం: ఈ నెల 8 నుంచి 12వ తేదీ వరకు శ్రీనగర్‌లో జరగనున్న జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు సబ్ జూనియర్స్ విభాగంలో భోగాపురం మండలంలోని తూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆర్.సాత్విక్, డి.దుర్గాదేవి, యు.లోకేశ్వరి ఎంపికయ్యారు. ఈ మేరకు ఆ విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు వి.అప్పన్న, వ్యాయామ ఉపాధ్యాయుడు సీహెచ్ సత్యనారాయణ, దివీస్ కంపెనీ యాజమాన్యం, తదితరులు మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు.



ఆర్చరీలో తలపడుతున్న విద్యార్థులు

ఆర్చరీ పోటీలకు ఎంపిక

సీతంపేట: ఆర్చరీ పోటీలకు స్థానిక గ్రీన్‌ఫీల్డ్ స్టేడియం ఆవరణలో జిల్లాస్థాయి ఎంపికలు మంగళవారం నిర్వహించారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి అండర్ 14,17,19 విభాగాల్లో జరిగిన ఎంపికలకు 150 మంది హాజరు కాగా 68 మంది ఎంపికయ్యారు. ఐటీడీఏ ఏపీవో చిన్నబాబు ఈ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ ఎంపికైన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో బాగా రాణించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.గీతాంజలి, డీడీ అన్నదొర, ఏఎంఓ కోటిబాబు, జీసీడీవో రాములమ్మ, క్రీడా పర్యవేక్షణాధికారి జాకాబ్‌దయానంద్, పీడీలు వెంకటరావు, బీవీ రమణమూర్తి, కె.రవి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఈత పోటీలకు గొట్లాం విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బొండపల్లి: రాష్ట్రస్థాయి ఈత పోటీలకు గొట్లాం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు అర్హత సాధించినట్లు హెచ్‌ఎం బి.శ్రీరామాచారి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆక్వా ఈత కాంప్లెక్స్‌లో మంగళవారం నిర్వహించిన జిల్లాస్థాయి ఈత పోటీల ఎంపికలో స్కూలుకు చెందిన విద్యార్థులు ఐదుగురు పాల్గొని ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. త్వరలో కాకినాడలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు యశ్వంత్, శ్రీను, చైతన్య, రిషి, సుశాంత్‌లు పాల్గొననున్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను మంగళరం స్కూల్‌లో పీడీ యు.సత్యానంద్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

కాకినాడలో స్విమ్మింగ్ పోటీలకు జిల్లా జట్టు సిద్ధం

- అండర్–14,17 విభాగాల్లో ఉత్సాహంగా సాగిన పోటీలు



జిల్లా స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో పోటీ పడుతున్న క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న స్కూల్ గేమ్స్ స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్లు సిద్ధమయ్యాయి. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపిక పోటీలకు అనూహ్య స్పందన లభించింది. అండర్–14,17 వయస్సుల విభాగాల్లో బాల,బాలికలకు నిర్వహించిన ఎంపిక పోటీలకు జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన 150మంది క్రీడాకారులు హాజరయ్యారు. వారికి వ్యాయామ ఉపాధ్యాయులు కేవీఎఎస్ రాజు, బంగార్రాజుల ఆధ్వర్యంలో ఎంపిక పోటీలు నిర్వహించగా..27 మంది బాలురు, 28మంది బాలికలు రాష్ట్రస్థాయికి అర్హత సాధించిన వారిలో ఉన్నారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో కాకినాడలో జరగనున్న అంతర్ జిల్లాల అండర్–14,17 బాల,బాలికల స్విమ్మింగ్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారు.

అంతర్ యూనివర్సిటీ బీబీ జట్ల ఎంపిక



అంతర్ యూనివర్సిటీ బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన మహిళలతో నిర్వాహకులు

రాజాం సిటీ: స్థానిక జీసీఎస్ఆర్ కళాశాలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ బాల్‌బ్యాడ్మింటన్ స్త్రీ, పురుషుల జట్ల ఎంపికకు పోటీలు జరిగాయి. మంగళవారం జరిగిన ఈ పోటీలకు యూనివర్సిటీ పరిధిలోని 14 కళాశాలల నుంచి 80 మంది పురుషులు, ఆరు కళాశాలల నుంచి 20 మంది మహిళలు హాజరయ్యారని పీడీ చీకటి కేశవనారాయణ తెలిపారు. వారిలో ఆరుగురు చొప్పున యూనివర్సిటీ జట్టును ఎంపిక చేశామని చెప్పారు. పురుషుల విభాగంలో జీసీఎస్ఆర్ కళాశాల ప్రథమస్థానంలో, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ద్వితీయ స్థానం, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల తృతీయ స్థానంలో నిలిచాయని తెలిపారు. మహిళల విభాగంలో ఎచ్చెర్లలోని వెంకటేశ్వర కళాశాల ప్రథమ, పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ద్వితీయ, జీసీఎస్ఆర్ కళాశాల తృతీయ స్థానంలో నిలిచాయని పేర్కొన్నారు. గెలుపొందిన పురుషుల జట్టు ఈ నెల 25 నుంచి 29 వరకు చెన్నైలోని ఎస్ఆర్ఎస్ యూనివర్సిటీలో జరగనున్న అంతర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. మహిళల పోటీలకు సంబంధించి ఇంకా తేదీలు ఖరారు కాలేదన్నారు. ఎంపికైన జట్టు సభ్యులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.పురుషోత్తంరావు, యూనివర్సిటీ పీడీ డాక్టర్ ఎం శ్రీనివాసరావు, డాక్టర్ ఎ.భాస్కరరావు, జీఎంఆర్ ఐటీ పీడీ బీహెచ్ అరుణ్‌కుమార్, పప్పల తిరుపతిరావు తదితరులు అభినందించారు.

ఆర్మీ ఉద్యోగాలకు అన్నదమ్ముల ఎంపిక

- హర్షం వ్యక్తం చేస్తున్న పాతబగ్గాం వాసులు



ఆర్మీ ఉద్యోగానికి ఎంపికైన సోదరులను అభినందిస్తున్న గ్రామ పెద్ద లెంక చిన్నంనాయుడు

గజపతినగరం: మండలంలోని పాతబగ్గాం గ్రామానికి చెందిన అప్పలనాయుడు, సత్యవతి దంపతులకు జన్మించిన ఇద్దరు కుమారులు ఆర్మీ ఉద్యోగాలకు ఎంపిక కావడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన కుమిలిరామునాయుడు(చిన్న), కుమిలి ప్రసాద్(పెద్ద) సోదరులు. చిన్న నాటి నుంచి ఒకరితో ఒకరు పోటీపడి కష్టపడి పట్టుదలతో చదివి ఆర్మీ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. రైతు కుటుంబంలో పుట్టిన సోదరులు విశాఖపట్నంలో జూలై నెలలో నిర్వహించిన రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. టెస్ట్ పూర్తయిన తరువాత ఆగస్టు 28న విశాఖలో నిర్వహించిన స్పోర్ట్స్(రన్నింగ్‌లో)లో ఎంపికయ్యారు. రామునాయుడు మహారాష్ట్ర 21న, ప్రసాద్ కర్నాటక 27న ట్రైనింగ్‌కు వెళ్లనున్నారు. దీంతో ఆ సోదరులను సర్పంచ్ లెంక పద్మావతి, చిన్నంనాయుడు దంపతులతో పాటు కర్రి బంగారునాయుడు,పప్పల గురినాయుడు, మంత్రి సూర్యం, కర్రితవుడు అభినందించారు.

'ఉచిత ఇసుక' అమలు చేయాలి

- కలెక్టరేట్ ఆవరణలో నిరసన దీక్ష



నిరసన దీక్షలో పాల్గొన్న కార్మికులు

పార్వతీపురం: ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఉచిత ఇసుక హామీని తక్షణం అమలు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆవరణలో మంగళవారం నిరసన దీక్ష చేపట్టారు. ఉచిత ఇసుక సరఫరాపై మూడు రోజుల పాటు దీక్ష నిర్వహించి 4వ తేదీన కలెక్టరేట్ వరకు ర్యాలీ, ధర్నా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇసుక రీచ్‌లను జిల్లా కేంద్రానికి 100కిలోమీటర్ల దూరంలో భామిని మండలం కాట్రగడలో ఏర్పాటు చేయడంతో రవాణా చార్జీలు తడిసి మోపెడయ్యే పరిస్థితి ఉందన్నారు. ఉచిత ఇసుక సరఫరా పేరిట రవాణా చార్జీలు, ఇతర చార్జీల రూపంలో ఇసుక మరింత ప్రియమైందని విమర్శించారు. ఇసుక కొరత, అధిక రేట్ల వల్ల భవన నిర్మాణాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయని, దీంతో భవన నిర్మాణ కార్మికులకు పనులు లేకపోవడంతో అర్ధాకలితో జీవించాల్సి వస్తోందని ఆవేదన వెళ్లగక్కారు. ఉచిత ఇసుక సరఫరా చేయాలని కోరుతూ అక్టోబర్ 4న కలెక్టరేట్ వద్ద దీక్ష, ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, రైతు సంఘం అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి మద్దతు తెలుపుతూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జి.వెంకటరమణ, సూరిబాబు, జి.దిలీప్ కుమార్, కె.నాగేశ్వరరావు, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర లీగల్ సెల్ ఉపాధ్యక్షుడి మృతి



ద్వారపురెడ్డి స్వరూప్‌కుమార్

విజయనగరం లీగల్: స్థానిక సీనియర్ న్యాయవాది, వైఎస్సార్ సీపీ రాష్ట్ర లీగల్‌సెల్ ఉపాధ్యక్షుడు ద్వారపురెడ్డి స్వరూప్‌కుమార్(64) ఆకస్మికంగా మంగళవారం మృతి చెం దారు. ఆయనకు అస్వస్థత చేకూరడంతో కుటుంబసభ్యులు స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయనకు భార్య డాక్టర్ పార్వతి, (ప్రముఖ ఆయుర్వేద వైద్యురాలు), ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆయన 1997లో స్థానిక ఎంవీజీఆర్ లా కళాశాలలో విద్యాభ్యాసం పూర్తి చేశారు. ప్రముఖసీనియర్ న్యాయవాది కోలగట్ల తమ్మన్నశెట్టి వద్ద జూనియర్‌గా చేరారు. ఆయన మరణవార్త తెలుసుకున్న రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ తమ్మన్నశెట్టి, న్యాయవాద సంఘం అధ్యక్షుడు ఎ. హరీష్, జిల్లా వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు ఎ.అంజనీకుమార్ హుటాహుటిన ఆయన స్వగృహానికి చేరుకుని నివాళులర్పించారు. ఆయన మృతిపట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి కుటుంబసభ్యులను ఓదార్చారు.

విద్యుత్ షాక్‌తో గీతకార్మికుడు..



మృతిచెందిన కృష్ణమ్మ

బొబ్బిలిరూరల్: మండలంలోని కొండదేవుపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు రాగోలు కృష్ణమ్మ (55) విద్యుత్ షాక్‌తో మంగళవారం మృతిచెందాడు. గ్రామ సమీపంలోని పామాయిల్ తోటలో కూలీగా పనిచేస్తున్న కృష్ణమ్మ మంగళవారం సాయంత్రం యథావిధిగా భుజంపై ఇనుప బొరెగెను పట్టుకుని పొలం గట్టుపై వెళ్తున్నాడు. ఇంతలో ఓ చోట గట్టు ఎత్తుగా ఉండడం, ఆపైనుంచే ప్రధాన విద్యుత్ తీగలు అతి దగ్గరగా వేలాడుతుండడంతో భుజంపై ఉన్న ఇనుప బొరెగెను విద్యుత్ తీగలను తాకాయి. దీంతో ఒక్కసారిగా షాక్‌కు గురైన కృష్ణమ్మ పక్కనేఉన్న వరిపంట పొలంలో పడిపోయినట్లు ఆయన భార్య లక్ష్మి తెలియజేసింది. చుట్టుపక్కల పొలాల్లో పనిచేస్తున్న రైతులు వచ్చి చూసేసరికి మృతిచెందాడని బావురుమంది.

పాముకాటుతో మహిళ..



పాముకాటుతో మృతి చెందిన సూర్యం (ఫైల్)

లక్కవరపుకోట: మండలంలోని చందులూరు గ్రామానికి చెందిన యడ్ల సూర్యం (63) పాముకాటుతో మంగళవారం మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఎప్పటి మాదిరిగా భోజనం చేసి ఇంట్లో మంచంపై ఆమె నిద్రిస్తుండగా సోమవారం అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో చేతిపై పాము కాటువేసినట్లు గుర్తించి కుటుంబసభ్యులను బాధితురాలు అప్రమత్తం చేసింది. వెంటనే ఆమెను లక్కవరపుకోట పీహెచ్‌సీకి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి 108 వాహనంలో ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారు జామున ఆమె మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతురాలికి వివాహమైన కుమార్తె ఉంది.

ఉత్సవ కళ



విద్యుత్ వెలుగులో పైడితల్లి ఆలయం



పుష్పాలంకరణలో పైడితల్లి



అమ్మవారికి సమర్పించేందుకు ఘటాలను తెచ్చిన మహిళా భక్తులు

ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి సిరిమానోత్సవం సమీపిస్తున్న వేళ విజయనగరానికి ఉత్సవ కళ వచ్చింది. అమ్మవారికి ప్రీతికరమైన మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పుష్పాలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారికి ఘటాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. చదురుగుడి వద్ద విశాఖ జిల్లా మధురవాడకు చెందిన నృత్య కళాశాల చిన్నారులు నృత్యప్రదర్శనతో భక్తులను అలరించారు. కళాకారులు తమ కళా ప్రదర్శనలతో అమ్మవారి సేవలో తరించారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు పర్యవేక్షించారు.

– సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం





ఘటాలతో ఆలయ తలయారీ రాయవరపు చిన పైడిరాజు



పులివేషాల ప్రదర్శన